క్లుప్తంగా

బాధితుడికి ఆర్థికసాయం



ఆర్థికసాయం అందజేస్తున్న సభ్యులు

లింగాపూర్: మండలంలోని మాన్కుగూడ గ్రామానికి చెందిన పెందూర్ యశ్వంత్‌రావు రోడ్డు ప్రమాదంలో గాయపడగా రెహమాన్ ఫౌండేషన్ చైర్మన్ అబ్దుల్ రెహమాన్ బాధిత కుటుంబానికి శుక్రవారం రూ.5000 ఆర్థిక సాయం అందజేశారు. ఫౌండేషన్ సభ్యులు ఆర్క సుదర్శన్, జాటోత్ దవీత్‌కుమార్, మేస్రం బాదిపటేల్, విశ్వకాంత్, మారుతి, భీం రావు, జంగూ తదితరులు ఉన్నారు.

ప్రభుత్వ కళాశాల ప్రిన్సిపాల్‌గా రాందాస్



ప్రిన్సిపాల్‌ను సన్మానిస్తున్న సిబ్బంది

వాంకిడి: మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్‌గా బి.రాందాస్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఇదివరకు ఇక్కడ ప్రిన్సిపాల్‌గా విధులు నిర్వర్తించిన సంపత్‌కుమార్ బదిలీపై వరంగల్ జిల్లాకు వెళ్లారు. ఈ సందర్భంగా సంపత్‌కుమార్‌ను కళాశాల సిబ్బంది శాలువాలతో సన్మానించారు. కళాశాల అభివృద్ధికి, విద్యార్థుల ఉత్తీర్ణత శాతం పెంచడంలో ఆయన చేసిన కృషిని కొనియాడారు. కార్యక్రమంలో కళాశాల బోధన సిబ్బంది పాల్గొన్నారు.

కాలనీ సమస్యలు పరిష్కరించాలి



వినతిపత్రం అందజేస్తున్న కాలనీవాసులు

జైనూర్: సంజయ్‌నగర్ కాలనీవాసుల సమస్యలు పరిష్కరించేందుకు చర్యలు చేపట్టాలని కోరుతూ శుక్రవారం ఎంపీడీవో సిబ్బందికి కాలనీవాసులు వినతిపత్రం అందజేశారు. ఆదివాసీ జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు కనక యాదవరావు మాట్లాడుతూ సంజయ్‌నగర్ కాలనీ వాగుకు ఆనుకొని ఉండటంతో పాములు, తేళ్లు, ఇతర విష పురుగులు రోడ్డుపైకి వస్తున్నాయన్నారు. సాయంత్రం వేళల్లో చిన్నారులు, పెద్దలు రోడ్డు మీదకు రావడానికి భయాందోళన చెందుతున్నారని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీల ఫోరం అధ్యక్షుడు కుమ్ర భగవంత్‌రావు, చింటన్న, రమేశ్, వెంకటి, భూమన్న, తదితరులు ఉన్నారు.

వీవోఏలను సెర్ప్ ఉద్యోగులుగా గుర్తించాలి

జైనూర్: ఐకేపీ వీవోఏలను సెర్ప్ ఉద్యోగులుగా గుర్తించాలని వీవోఏల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి జ్యోతి డిమాండ్ చేశారు. శుక్రవారం మండల కేంద్రంలోని మార్కెట్‌లో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎన్నికల వేళ కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు వీవోఏలకు రూ.26 వేలు వేతనంతో పాటు సెర్ప్ ఉద్యోగులుగా గుర్తించాలన్నారు. కాంగ్రెస్ పార్టీ మేనిఫెస్టోలో సైతం వీవోఏలకు రూ.18000వేతనం అందిస్తామని హామీ ఇచ్చినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో సంఘం మండల అధ్యక్షుడు భరత్, కార్యదర్శి రజిత, మాలిక్, సురేశ్, చంద్రకాంత్, లక్ష్మి తదితరులు ఉన్నారు.

బీమా చెక్కు పంపిణీ

పెంచికల్‌పేట్: మండలంలోని పోతెపల్లి గ్రామానికి చెందిన తెలిగె పెంటయ్య ఇటీవల అనారోగ్యంతో మృతి చెందగా, బాధిత కుటుంబానికి జీవన్ జ్యోతి బీమా పథకంలో వచ్చిన రూ.2లక్షల చెక్కును నామినీ పోచక్కకు తెలంగాణ గ్రామీణ బ్యాంకు రాస్పల్లి మేనేజర్ సాయిచరణ్ అందజేశారు. బ్యాంకు ఖాతా కలిగిన ప్రతి ఒక్కరూ ఇన్సురెన్స్ చేయించుకోవాలన్నారు. బ్యాంకు అధికారులు ప్రవీణ్, సత్తిరెడ్డి, మాజీ సర్పంచ్ చంద్రమౌళి పాల్గొన్నారు.

కోర్టు ఆవరణలో వనమహోత్సవం



మొక్క నాటుతున్న ఎంవీ రమేశ్

ఆసిఫాబాద్: జిల్లా కేంద్రంలోని కోర్టు ఆవరణలో శుక్రవారం జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎంవీవీ రమేశ్, సీనియర్ సివిల్‌జడ్జి యువరాజా, జూనియర్ సివిల్ జడ్జి అనంతలక్ష్మితో కలిసి మొక్కలు నాటారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు రాపర్తి రవీందర్, సీనియర్ న్యాయవాదులు టి. సురేశ్, ఎం. సురేశ్, ప్రకాశ్ చంద్ జైన్, బోనగిరి సతీశ్ బాబు, చంద్రకుమార్, రాజీవ్‌రెడ్డి, న్యాయవాదులు పాల్గొన్నారు.

జ్వరాలతో ఉక్కిరిబిక్కిరి



బెజ్జూర్ పీహెచ్‌సీలో జ్వరంతో బాధపడుతున్న రోగులు



ఓ బావి వద్ద నిలిచి ఉన్న నీరు

- మంచం పడుతున్న ప్రజలు
- పారిశుధ్య నిర్వహణ అస్తవ్యస్తం
- మండల కేంద్రంలో నమోదవుతున్న డెంగీ కేసులు

బెజ్జూర్: ప్రస్తుతం సీజనల్ వ్యాధులతో జిల్లా ప్రజలు ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. ఇంటికి ఒకరిద్దరు చొప్పున మంచం బారిన పడుతున్నారు. గ్రామాల్లో పారిశుధ్యం లోపించడంతో దోమలు, ఈగలతో రోగాలు వ్యాపిస్తున్నాయి. ఎప్పటికప్పుడు పారిశుధ్య పనులు చేయించాల్సిన అధికారులు తమకేమి పట్టనట్లుగా వ్యవహరిస్తుండడంతో ప్రజలు అవస్థలు పడుతున్నారు. వర్షాకాలంలో విష జ్వరాలు ప్రబలే అవకాశం ఉందని, అప్రమత్తంగా ఉండాలని సమావేశాల్లో అధికారులు, ప్రజాప్రతినిధులు చెప్పడమే తప్పా పారిశుధ్య నిర్వహణ కోసం ఎలాంటి చర్యలు చేపట్టడం లేదని ఆయా గ్రామాల ప్రజలు ఆరోపిస్తున్నారు. బెజ్జూర్ మండల కేంద్రంతో పాటు ముంజంపల్లి, బారెగూడెం, పోతేపెల్లి, లంబాడిగూడ, పాపన్నపేట, కుకుడ, ఎలుకపెల్లి తదితర గ్రామాల్లో పారిశుధ్యం అస్తవ్యస్తంగా మారింది. దీంతో ఆయా గ్రామాల ప్రజలు విష జ్వరాలతో ఇబ్బందులు పడుతున్నారు.

ప్రతీ ఇంటా జ్వరపీడితులే..

మండల కేంద్రంతో పాటు ముంజంపల్లి, బారెగూడెం గ్రామాల్లో ఇంటికి ఒకరు చొప్పున జ్వరపీడితులు ఉన్నారు. విషజ్వరాలతో మంచం బారిన పడ్డారు. పాపన్నపేట, కుకుడ, పోతేపెల్లి, లుంబినగర్, ఎలుకపల్లి తదితర గ్రామాల్లో ఇప్పుడిప్పుడే జ్వరాలు సోకుతున్నాయి. అలాగే బెజ్జూర్, బారెగూడెం, ముంజంపల్లి, అందుగులగూడెం గ్రామాల్లో మాత్రం గత కొన్ని రోజులుగా ప్రజలు జ్వరాలతో నానా అవస్థలు పడుతున్నారు. జ్వరాలు రావడంతో పాటు కీళ్ల నొప్పులు, కాళ్ల నొప్పులతో అవస్థలు పడుతున్నారు.

'డెంగీ' జ్వరాలు..

మండల కేంద్రంలో ఇప్పటివరకు దాదాపు 20కి పైగా డెంగీ అనుమానిత కేసులు నమోదయ్యాయి. దీంతో గ్రామస్తులు ఆందోళనకు గురవుతున్నారు. రెండు నుంచి మూడు రోజుల పాటు జ్వరం వస్తే ప్లేట్‌లెట్స్ పడిపోవడంతో ఇబ్బందులు పడుతున్నారు. వీటి నివారణ కోసం చర్యలు చేపట్టాల్సిన అధికారులు తమకేమి పట్టనట్లుగా వ్యవహరిస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. గ్రామాల్లో వైద్య శిబిరాలు ఏర్పాటు చేసి విషజ్వరాల బారి నుంచి కాపాడాలని కోరుతున్నారు.

ఫొటోలకు ఫోజులు..

సర్పంచుల పదవీ కాలం ముగిసి దాదాపు ఆరు నెలలు గడుస్తోంది. ప్రభుత్వం ప్రత్యేక అధికారులను నియమించినప్పటికీ అధికారులు గ్రామపంచాయతీల్లో ఏ ఒక్కరోజు కూడా పర్యటించిన దాఖలాలు లేవు. పంచాయతీల్లో అక్కడక్కడా పారిశుధ్య పనులు చేపట్టినట్లు ఫొటోలు దిగి ఫోజులు ఇవ్వడమే తప్పా ఎలాంటి చర్యలు చేపట్టడం లేదని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. మండలంలో 22 గ్రామపంచాయతీలు ఉన్నాయి. వర్షాకాలం ప్రారంభం నుంచి మొదలుకొని ఇప్పటివరకు ఏ ఒక్క గ్రామ పంచాయతీలో కూడా పారిశుధ్య పనులు చేపట్టలేదు. దీంతో గ్రామాల్లోని మురికి కాల్వల్లో పూడిక పేరుకుపోయి మురుగు నీరు రోడ్లపై ప్రవహిస్తోంది. దీంతో ఈగలు, దోమలు వ్యాప్తి చెంది వ్యాధులకు కారణమవుతున్నాయని గ్రామస్తులు వాపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి మండలంలోని గ్రామాల్లో మెడికల్ క్యాంపులు ఏర్పాటు చేసి ఆదుకోవాలని కోరుతున్నారు.

ఆస్పత్రుల వద్ద బారులు..

విషజ్వరాలతో బాధపడుతున్న రోగులు మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రితో పాటు మండలంలోని ఆయా ఆర్ఎంపీ, పీఎంపీల వద్ద వైద్యం కోసం బారులు తీరాల్సిన దుస్థితి నెలకొంది. ఓవైపు గ్రామస్తులు విషజ్వరాలతో అల్లాడుతుంటే అధికారులు, ప్రజాప్రతినిధులు తమకేమి పట్టనట్లుగా వ్యవహరిస్తుండడం పట్ల ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. గ్రామాల్లో వైద్య శిబిరాలు ఏర్పాటు చేసి రోగులకు చికిత్సలు అందించాలని పేర్కొన్నారు.

ఇంట్లో అందరికీ 'డెంగీ'..



మా ఇంట్లో అందరికీ డెంగీ జ్వరం వచ్చింది. రక్త కణాలు తక్కువయ్యాయి. ప్రైవేట్ ఆస్పత్రికి వెళ్లి చికిత్స తీసుకున్నాం. గ్రామంలో పారిశుధ్యం అస్తవ్యస్తంగా ఉంది. దీంతో దోమలు, ఈగలు వ్యాప్తి చెందుతున్నాయి. అధికారులు స్పందించి పారిశుధ్య పనులు చేపట్టాలి.

– సల్మాన్, బెజ్జూర్

వారం రోజులుగా జ్వరం..



వారం రోజులుగా జ్వరం వస్తోంది. ప్రైవేట్ ఆస్పత్రిలో చూపించుకున్నాను. తగ్గకపోవడంతో ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాను. రక్త కణాలు తగ్గుతున్నాయని, డెంగీ జ్వరం అని డాక్టర్లు చెబుతున్నారు.

– రోజా, బెజ్జూర్

వైద్య సేవలు అందిస్తున్నాం..



బెజ్జూర్ మండల కేంద్రంలో ఇప్పటివరకు రెండు డెంగీ కేసులు నమోదయ్యాయి. మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వారికి వైద్య సేవలు అందిస్తున్నాం. సీజనల్ కావడంతో విష జ్వరాలు సైతం సోకుతున్నాయి. దీనిపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నాం.

– డాక్టర్ అవినాష్, బెజ్జూర్ పీహెచ్‌సీ వైద్యుడు

కాపర్ వైర్ చోరీ

తిర్యాణి: మండలంలోని కైరిగూడ ఓపెన్‌కాస్టు పరిసర ప్రాంతంలోని ఓసీపీకి సంబంధించిన 30 మీటర్ల కాపర్‌వైరును గుర్తు తెలియని వ్యక్తులు దొంగిలించినట్లు ఫిర్యాదు అందిందని ఎస్సై మాధవ్ తెలిపారు. ఆయన మాట్లాడుతూ గురువారం రాత్రి దొంగతనం జరిగిందని సింగరేణి సంస్థకు చెందిన ఎస్అండ్‌పీసీ జూనియర్ ఇన్‌స్పెక్టర్ రాజమౌళి ఫిర్యాదు మేరకు కేసు నమెదు చేసి దర్యాప్తు చేపడుతున్నట్లు పేర్కొన్నారు.

కథల పుస్తకాలతో చదివే అలవాటు పెంపొందించాలి

రెబ్బెన: పిల్లల్లో చదివే అలవాటును పెంపొందించేందుకు కథల పుస్తకాలను ఉపయోగించాలని మండల నోడల్ అధికారి వెంకటేశ్వర్లు అన్నారు. శుక్రవారం మండలంలోని నవేగాం ఎంపీపీఎస్ పాఠశాలల్లో రీడింగ్ క్యాంపెన్ ఏర్పాటు చేయగా ఆయన సందర్శించారు. ప్రధానోపాధ్యాయులు సదానందం, ఉపాధ్యాయులు ప్రవీణ్, మోతేరావు పాల్గొన్నారు.

'ఉపాధి' పనుల తనిఖీ

కెరమెరి: గడిచిన మూడేళ్ల ఉపాధిహామీ పథకంలో జరిగిన పనులను రాష్ట్ర తనిఖీ బృందం అధికారులు, సభ్యులు నర్సింలు, వెంకటేశ్ శుక్రవారం తనిఖీలు చేపట్టారు. కెరమెరి, కెలిబి గ్రామపంచాయతీల్లో నిర్వహించిన 26 పనులు పల్లె ప్రకృతివనాలు, సెగ్రిగేషన్ షెడ్లు, శ్మశాన వాటికలు, ఎవెన్యూ ప్లాంటేషన్, కమ్యూనిటీ, మ్యాజిక్ సోప్‌పిట్లు, క్రీడా ప్రాంగణాలు పరిశీలించారు. కార్యాలయంలో రికార్డులు పరిశీలించారు. ఈజీఎస్ ఏపీవో మల్లయ్య, ఈసీ ఐక్యానాయక్, ఆయా ప్రాంతాలకు చెందిన టీఏలు ఉన్నారు.

జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి తనిఖీలు

రెబ్బెన: మండలంలోని పలు ప్రభుత్వ పాఠశాలల్లో శుక్రవారం జిల్లా పౌర సరఫరాల అధికారి వినోద్‌కుమార్ తనిఖీలు చేపట్టారు. మండల కేంద్రంలోని టీఎస్‌డబ్ల్యూఆర్ఎస్ బాలికల పాఠశాలతో పాటు గంగాపూర్‌లోని కస్తూరిబా విద్యాలయం, గోలేటి విలేజ్‌లోని ఐటీడీఏ ఆశ్రమ పాఠశాలతో పాటు పలు అంగన్‌వాడీ కేంద్రాలను తనిఖీ చేశారు. ఆయా పాఠశాలలకు ప్రభుత్వం నుంచి సరాఫరా అవుతున్న బియ్యం, పప్పులు, పాలు, కోడిగుడ్లు, నూనె వంటి వాటిని పరిశీలించి వాటి నాణ్యత పరిశీలించారు. ప్రధానోపాధ్యాయులు జ్యోతి, పద్మ, అంగన్‌వాటీ టీచర్లు చంద్రకళ, సంధ్యారాణిలను సరుకుల నాణ్యత అడిగి తెలుసుకున్నారు. గంగాపూర్ కేజీబీవీలో విద్యార్థులతో కలిసి భోజనం చేశారు.

15లోగా ఆన్‌లైన్ పూర్తి చేయాలి

బెజ్జూర్: మండల కేంద్రంలోని వ్యవసాయ సహకార సంఘంలో గత కొన్ని సంవత్సరాల క్రితం నుంచి రైతులు తీసుకున్న రుణాలు, ఎరువులు, విత్తనాల క్రయవిక్రయాలకు సంబంధించిన వివరాలు వచ్చేనెల 15వ తేదీలోగా ఆన్‌లైన్‌లో పొందుపర్చాలని ఆసిఫాబాద్ డీసీవో రాథోడ్ బిక్కు నాయక్, సహకార సంఘం చైర్మన్ కుర్సింగా ఓంప్రకాశ్ అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలో డీసీవో కార్యాలయంలో సహకార సంఘంలోని సమస్యలపై ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు. 15లోగా రైతుల సమస్యలు పరిష్కరించేందుకు మాజీ సీఈవో వెంకటేశ్వర్ గౌడ్‌తో పాటు ప్రస్తుత సీఈవో సంజీవ్ కుమార్ ఒప్పుకున్నట్లు తెలిపారు. సిబ్బందికి సైతం జీతాలు వారం రోజుల్లో ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. కాగా జిల్లా డీసీవోగా ఇటీవల బాధ్యతలు చేపట్టిన రాథోడ్ బిక్కునాయక్‌ను చైర్మన్ ఓంప్రకాష్ ఆధ్వర్యంలో డైరెక్టర్లు రాచకొండ శ్రీవర్ధన్, తేలి బాపు, కోటేశ్వర్, కమలాకర్, శకుంతల, మాజీ సీఈవో వెంకటేశ్వర్ గౌడ్, ప్రస్తుత సీఈవో సంజీవు శాలువాతో ఘనంగా సన్మానించారు.

మానవత్వం చాటుకున్న మాజీ ఎంపీపీ

ఆసిఫాబాద్‌రూరల్: అదుపుతప్పిన ఆటో చెట్టును ఢీకొనగా గాయాలైన డ్రైవర్‌ను మాజీ ఎంపీపీ మల్లికార్జున్ తన సొంత వాహనంలో జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి వైద్యం అందించి మానవత్వం చాటుకున్నారు. వివరాల్లోకి వెళ్తే.. శుక్రవారం చిర్రకుంట నుంచి ఆసిఫాబాద్‌కు వస్తున్న ఆటో అదుపుతప్పి తుంపెల్లి సమీపంలో చెట్టును ఢీ కొట్టింది. అదే సమయంలో అటువైపు వెళ్తున్న మాజీ ఎంపీపీ మల్లికార్జున్ గాయాలైన డ్రైవర్‌ను తన వాహనంలో ఆసుపత్రికి తీసుకెళ్లారు.

జీఎం (సీఎంసీ) పర్యటన

రెబ్బెన: బెల్లంపల్లి ఏరియాలో శుక్రవారం జీఎం (సీఎంసీ) మోహన్‌రెడ్డి పర్యటించారు. ఈసందర్భంగా గోలేటి టౌన్‌షిప్‌లోని జీఎం కార్యాలయం కాన్ఫరెన్స్ హాల్‌లో ఏరియా అధికారులతో కలిసి సమావేశం నిర్వహించారు. జీఎం (సీఎంసీ)ని ఏరియా జనరల్ మేనేజర్ శ్రీనివాస్‌తో పాటు ఇతర విభాగాల అధికారులు శాలువాతో సన్మానించి మొక్క అందజేశారు. ఎస్‌వోటూజీఎం రాజమల్లు, పీవో నరేందర్, పర్సనల్ మేనేజర్ రెడ్డిమల్ల తిరుపతి, అధికారులు పాల్గొన్నారు.

సీహెచ్‌పీని సందర్శించిన జీఎం

రెబ్బెన: బెల్లంపల్లి ఏరియాలోని గోలేటి సీహెచ్‌పీని శుక్రవారం ఏరియా జీఎం ఎం. శ్రీనివాస్ సందర్శించారు. సీహెచ్‌పీ ఆవరణలో, బొగ్గు రవాణా చేసే లారీలు నడిచే ప్రాంతాల్లో నీటిని చల్లే విధానాన్ని, ఆన్‌లైన్ మానిటరింగ్ విధానాన్ని పరిశీలించి సిబ్బందిని అభినందించారు. మెరుగైన పనితీరు, రక్షణ, రవాణా కోసం పలు సూచనలు అందించారు. ఈ సందర్భంగా జీఎంను సీహెచ్‌పీ ఉద్యోగులు శాలువాతో సన్మానించారు. ఏరియా ఇంజనీరు భీంరావు జాడే, సీహెచ్‌పీ ఎస్ఈ కోటయ్య, ఈఈ రాజు తదితరులు పాల్గొన్నారు.

అర్హత ఉన్న రైతులకు రుణమాఫీ



ఫిర్యాదులు స్వీకరిస్తున్న నోడల్ అధికారి

దహెగాం: ప్రభుత్వం ప్రకటించిన రూ.2 లక్షల రుణమాఫీ అర్హులందరికీ వస్తుందని నోడల్ అధికారి మనోహర్ అన్నారు. శుక్రవారం మండలంలోని హత్తిని, మొట్లగూడ క్లస్టర్ పరిధిలోని రుణమాఫీ సందేహాలను నివృత్తి చేయడానికి ఫిర్యాదుల స్వీకరణ, అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ముందుగా రుణమాఫీ కాని వారి నుంచి ఫిర్యాదులు స్వీకరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సాంకేతిక కారణాల వల్ల కొందరికి రుణమాఫీ కాలేదన్నారు. పేర్లలో తప్పులు, ఆధార్ అనుసంధానం లేకపోవడం తదితర కారణాల వల్ల రుణమాఫీ కాని రైతులు సంబంధిత ఏఈవోలకు సమాచారం ఇవ్వాలని సూచించారు. కార్యక్రమంలో కుంచవెల్లి తెలంగాణ గ్రామీణ బ్యాంకు మేనేజర్ ప్రవీణ్‌కుమార్, ఏఈవోలు దీపక్, ఆనంద్ రావు, రైతులు పాల్గొన్నారు.

చింతలమానెపల్లి: రుణమాఫీపై రైతులు ఆందోళన చెందవద్దని మండల వ్యవసాయ అధికారి రామక్రిష్ణ అన్నారు. శుక్రవారం మండలంలోని తెలంగాణ గ్రామీణ బ్యాంక్, రైతు వేదికల్లో రైతులతో మాట్లాడారు. వారి సందేహాలను తెలుసుకొని నివృత్తి చేశారు. అర్హులైన ప్రతీ ఒక్క రైతుకు రుణమాఫీ అవుతుందని తెలిపారు. ఏఈవో శ్రీలత ఉన్నారు.

అర్హులందరికీ రుణమాఫీ చేయాలి



రిలే నిరాహారదీక్ష చేస్తున్న బీజేపీ నాయకులు

రెబ్బెన: రైతులందరికీ రాష్ట్ర ప్రభుత్వం రూ.2లక్షల రుణమాఫీ చేయాలని బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి కేసరి ఆంజనేయులు గౌడ్ అన్నారు. రెబ్బెన పీఏసీఎస్‌లో అవకతవకలపై పూర్తి విచారణ చేపట్టి రైతులకు న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం మండల కేంద్రంలోని రైతువేదిక ముందు నిరాహార దీక్షలు చేపట్టారు. పీఏసీఎస్‌లో అవినీతిపై సమగ్ర విచారణ చేపట్టి బాధ్యులపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. జిల్లా ఉపాధ్యక్షుడు చక్రపాణి, జిల్లా కార్యదర్శి బాలక్రిష్ణ, మండల ప్రధాన కార్యదర్శి నవీన్ గౌడ్, నాయకులు సంజీవ్, నందకిషోర్, రాజేశ్, శ్రీశైలం తదితరులు పాల్గొన్నారు.

ఎదగని పత్తి



మోతుగూడలో ఎదగని పత్తి పంట

- దిగుబడిపై ప్రభావం
- దిగులు పడుతున్న రైతన్న

ఆసిఫాబాద్‌రూరల్: అధిక వర్షాల కారణంగా పత్తి పంట దిగుబడులపై తీవ్ర ప్రభావం పడుతోంది. ఈ ఖరీఫ్ సీజన్ ప్రారంభంలో వర్షాలు లేకపోవడం .. పత్తి సాగు చేసిన నెల తర్వాత నుంచి చాలా రోజులపాటు ముసురు పడడంతో పత్తి పంటకు తీవ్ర నష్టం కలిగిందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ముసురు వానకు పత్తి చేనుల్లో నీరు నిలిచి పంట ఎదగకుండా ఎర్రబడి పోతోంది. ఆసిఫాబాద్ మండలంలోని ఎక్కువ మంది రైతులు గతంలో పప్పుదినుసులు, కంది, పెసర, జొన్న, సోయా పంటలను సాగు చేసేవారు. కానీ గత 10 సంవత్సరాల నుంచి పత్తి పంటపై దృష్టి సారించి ఏటా పత్తి పంట సాగు విస్తీర్ణం పెంచుకుంటూ పోతున్నారు. ఈ ఏడాది కూడా పత్తిపంటను పెద్ద మొత్తంలో సాగు చేశారు. ఆసిఫాబాద్ మండలంలో పత్తి పంట గత ఏడాది 34వేల ఎకరాలలో సాగు చేయగా ఈ ఏడు 36 వేల ఎకరాలలో సాగు చేశారు.

వర్షాల కారణంగా..

పత్తి పంట ఎదుగుదలకు వర్షాలే కారణంగా రైతులు పేర్కొంటున్నారు. ముసురు వర్షాలు, భారీ వర్షాల కారణంగా పత్తి పంటలో నీరు నిలిచి పంట ఎదగలేదు. ఇప్పటి వరకు 6 నుంచి 7 ఫీట్ల ఎత్తులో ఉండాల్సిన పత్తి పంట వర్షాల కారణంగా 1 నుంచి 2 ఫీట్ల ఎత్తు వరకే ఉంది. వర్షాల కారణంగా చేనుల్లో నీరు నిలిచి పత్తి పంట ఎర్రబడి పెరుగుదల లేక అనేక రోగాలు వస్తున్నాయని, ఇప్పటికే నాలుగైదు సార్లు మందులు పిచికారీ చేసినా పత్తి ఎదుగుదల లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చిన్న మొలకలుగా ఉన్న దశలోనే ముసురు వర్షాలతో పత్తి ఎదుగుదలపై ప్రభావం పడింది. ప్రస్తుతం ఒక్కో పత్తి చెట్టుకు 20 నుంచి 30 కాయలు ఉండాల్సి ఉండగా ఇంకా కాయలు కన్పించడం లేదు.

పత్తికి చీడపీడలు..

విత్తనాలు వేసిన నాటి నుంచి వర్షాలు కురువడంతో ఈ ఏడాది పత్తిపంట ఆశించిన స్థాయిలో ఎదగలేదు. దీంతో పత్తి పంటలో పచ్చదనం, నిండుదనం లేకుండా పోయింది. దీనికి తోడూ గతంలో ఎన్నడూ లేని విధంగా పేనుబంక, వేరుకుళ్లు తెగులు, ఆకులు రాలిపోవడం మరోవైపు చీడపీడలు వ్యాప్తి చెందాయి. పత్తి పంటకు అధికంగా గులాబీరంగు పురుగు ఆశించి నష్టపరుస్తోంది. గులాబీ రంగు పురుగు కాయకు రంధ్రం చేసి పత్తికి నష్టం చేస్తుంది. దీంతో పత్తి క్వాలిటీ తగ్గడం, దిగుబడి తగ్గే ప్రమాదం ఉంది. దీని నివారణ కోసం వ్యవసాయ అధికారులు రైతులకు ఎలాంటి మందులు వాడలో అవగాహన కల్పించకపోవడంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారు. ఎరువుల దుకాణాల నిర్వాహకులు ఇచ్చిన మందులను వాడుతున్నారు. కాగా పంట ఎదుగుదల కోసం వేపనూనె పిచికారీ చేయాలని ఏఈవో చిరంజీవి పేర్కొంటున్నారు. ఎండిపోయినట్లు కన్పించే మొక్కలకు కాపర్ ఆక్సి క్లోరైడ్‌ను ఒక లీటర్ నీటిలో 3గ్రాముల కలిపి చెట్టు చుట్టూ పోయాలని రైతులకు సూచిస్తున్నారు. రైతులు ఎలాంటి సందేహాలు ఉన్నా ఏఈవో కార్యాలయంలో సంప్రదించాలని పేర్కొంటున్నారు.

కాలువకు మరమ్మతులు చేపట్టరూ..!



దహెగాం: గత నెలలో కురిసిన భారీ వర్షాలకు కాలువలు ధ్వంసం కాగా వాటికి మరమ్మతులు చేపట్టే నాథుడే కరువయ్యారు. దహెగాం మండల కేంద్రం సమీపంలో ఉన్న పెద్ద చెరువుకు సంబంధించిన కాలువ ధ్వంసమైంది. కాలువకు ఎలాంటి మరమ్మతులు చేపట్టకపోవడంతో నీరంతా వృథాగా పోతుందని రైతులు వాపోతున్నారు. ఏటా కాలువలకు తామే మట్టిపోసి మరమ్మతులు చేపడుతున్నామని, అధికారులు పట్టించుకోవడం లేదని రైతులు ఆరోపిస్తున్నారు.

అందరికీ చదవడం, రాయడం రావాలి

కెరమెరి: రెండో తరగతి నుంచి పైతరగతుల విద్యార్థులకు చదవడం, రాయడం రావాలని ఎంఎస్‌వో ఆడే ప్రకాశ్ అన్నారు. శుక్రవారం మండలంలోని సాకడ(బి) పాఠశాలను ఆయన సందర్శించారు. విద్యార్థులతో చదివించారు. ఎఫ్ఎల్ఎన్ ద్వారా విద్యా బోధన చేయాలన్నారు. హెచ్ఎం రమేశ్, తదితరులు ఉన్నారు.

కార్యవర్గం ఎన్నిక



ఎన్నికైన సభ్యులను సన్మానిస్తున్న ట్రస్మా నాయకులు

కెరమెరి: మండలంలోని రికగ్నైజ్డ్ స్కూల్ మేనేమెంట్ అసోషియేషణ్ నూతన కార్యవర్గాన్ని రాష్ట్ర, జిల్లా యూనియన్ నాయకులు ఆధ్వర్యంలో శుక్రవారం మండల కేంద్రంలోని బ్లూమింగ్ బడ్స్ పాఠశాలలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండలాధ్యక్షుడిగా గందం సంపత్‌కుమార్(గ్రేస్ మెమోరియల్ స్కూల్), ప్రధాన కార్యదర్శిగా ఆంజనేయులు(బ్లూమింగ్ బడ్స్), కోశాధికారిగా షేక్ సలీం(ఇండియన్ స్కూల్)ను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో ట్రస్మా రాష్ట్ర, జిల్లా నాయకులు కిషన్, దైవభూషణం, రాజేంద్రప్రసాద్, సంజీవ్, జ్యోతిష్, గోపాల్, పోషం, సంతోష్, తిరుపతి, తుల్సిదాస్ ఉన్నారు.

పోలీస్‌స్టేషన్ తనిఖీ చేసిన సీఐ



సిబ్బందికి సూచనలు చేస్తున్న సీఐ

పెంచికల్‌పేట్: మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌ను కాగజ్‌నగర్ రూరల్ సీఐ శ్రీనివాస్ రావు శుక్రవారం తనిఖీ చేసి స్టేషన్‌లోని రికార్డులు పరిశీలించారు. పోలీస్‌స్టేషన్‌లో నమోదవుతున్న కేసుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. పోలీ స్‌స్టేషన్ ఆవరణ పరిశుభ్రంగా ఉంచాలని, మొక్కలు నాటాలని సూచించారు. వినాయక చవితి నేపథ్యంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని సూచించారు. ఆయన వెంట ఎస్సై కొమురయ్య, సిబ్బంది ఉన్నారు.